క్లుప్తంగా

జిల్లా ప్రధాన కార్యదర్శిగా మందుల రాంబాబు

నడిగూడెం : ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నడిగూడెం మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు మందుల రాంబాబు నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొట్టె నాగరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబుకు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి సింగం నాగమణి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్‌ సిస్టం బహూకరణ



సౌండ్‌ సిస్టం అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన కొత్త శోభారాణి జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు కొత్త సిద్ధార్థ, మల్లిక రూ.12 వేల విలువైన సౌండ్‌ సిస్టంను పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు బుధవారం బహూకరించారు. ఎంఎన్‌ఓ బీరెల్లి శ్రీనివాస్‌ రెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎం జయప్రదకు సౌండ్‌ సిస్టం అందజేశారు. కార్యక్రమంలో పీడీ జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడు, నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురంలో గల అభయాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కుర్రి గోపయ్యను కోదాడ మాజీ సర్పంచ్‌ ఏర్నేని వెంకటరత్నంబాబు, మాజీ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ కందుల కోటేశ్వరరావు, చిత్తలూరి శివయ్య సమక్షంలో బుధవారం ఎన్నుకున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవాలను కలిసికట్టుగా నిర్వహించుకుందామని నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనను ఎన్నుకున్న నాయకులు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపుల ముందస్తు అరెస్ట్‌



అరెస్టయిన మున్నూరు కాపులు

నేరేడుచర్ల : కుల గణనలో మున్నూరు కాపు జనాభా తక్కువ చేసి చూపించడంపై నిరసనగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడికి మున్నూరు కాపు పిలుపునివ్వడంతో బుధవారం నేరేడుచర్ల మండలంలో మున్నూరు కాపులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు మాట్లాడుతూ.. అరెస్టలతోనే ఉద్యమం బలపడుతుందన్నారు. విషయంపై అరెస్టయిన వారిలో బాల వెంకటేశ్వర్లు, అంబటి నాగేశ్వర్‌రావు, కాలం నాగయ్య, వెన్నం సురేష్‌ తదితరులు ఉన్నారు.

కబడ్డీ కోచ్‌ వినయ్‌కు సన్మానం



చిలక వినయ్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు చిలక వినయ్‌ ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా బుధవారం నారాయణపురంలో వినయ్‌ను ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ బాణాల అబ్రహం, సీనియర్‌ నాయకులు కుటుంబరావు, కందుకూరి నాగేశ్వరరావు, శ్రీను, బొల్లెపంగు వెంకటి, నాగరాజు, వీరస్వామి, సైదులు, లాలు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు, కరివిరాల సబ్‌స్టేషన్‌ పరిధిలోని చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం గ్రామాల్లో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కె.సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా చేసే ఫీడర్‌ చానళ్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

చిన్నగట్టు జాతర చూసొద్దామా..

- 16వ తేదీ నుంచి ప్రారంభం
- పెద్దగట్టు జాతర తరహాలో పూజలు
- ఎడ్ల పందేలు, క్రీడా పోటీలు
- భారీగా తరలిరానున్న ప్రజలు



ముస్తాబైన లింగమంతులస్వామి ఆలయం

కోదాడరూరల్ : సూర్యాపేట జిల్లాలో పెద్ద గట్టు జాతర తరహాలో కోదాడ మండలంలోని నల్లబండగూడెం శివారులో యాదవగట్టుపై నిర్వహించే చిన్నగట్టు జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి, విద్యుత్‌ దీపాలతో ముస్తాబు చేశారు. అయితే యాదవుల ఆరాధ్యదైవమైన లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర మాదిరిగానే రెండు ఏళ్లకొకసారి ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీ. గ్రామంలోని యాదవ కులపెద్దలతో పాటు స్థానిక ప్రజలంతా కలిసికట్టుగా మూడు రోజుల పాటు జాతరను వైభవంగా జరుపుతారు.

జాతర నిర్వహణ ఇలా..

ఈ నెల 16వ తేదీన సాయంత్రం నల్లబండగూడెంలో ప్రభ బండ్లు, గంపల ఊరేగింపు, 17న గుట్టపై ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 18న చంద్రపట్నం కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. జాతర సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతంలో క్రికెట్‌, కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎద్దుల పందెలు కూడా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15, 16 తేదీల్లో ఎడ్ల పందేలు ఉంటాయని, పాల వండ్లు విభాగం, రెండు పండ్ల విభాగంలో ఈ ఎడ్ల పందేలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

సౌకర్యాల కల్పన..

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గట్టు కింద భాగంలో సాగు చేసిన పంటల అవశేషాలను చదును చేశారు. గట్టు చుట్టూ కంప చెట్లను తొలగించి వచ్చిన భక్తులు ఉండేందుకు వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటుగా గట్టు చుట్టూ వాటర్‌ ట్యాంకులతో మంచినీటి వసతిని ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్‌ సదుపాయం కల్పించారు. ఈ జాతరకు భక్తులు భారీగా తరలిరానున్నారు. సూర్యాపేట జిల్లాతో పాటు ఖమ్మం, నల్లగొండ, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా పెద్దగట్టు జాతరకు హాజరు కాలేని వారు కూడా ఇక్కడికే వస్తారని తెలిపారు. పలు పార్టీల నాయకులు, ప్రముఖులు కూడా జాతరకు హాజరవనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

చిన్నగట్టు జాతరకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తాం. మూడు రోజుల పాటు అంగరంగా వైభవంగా జారత నిర్వహించనున్నాం. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలి.

– కంచుకంటి బాబు, లింగమంతుల ఆలయ కమిటీ చైర్మన్‌

చెరువు కట్ట రివిట్‌మెంట్‌ పనుల పరిశీలన



నారాయణపురం ఊర చెరువు కట్ట రివిట్‌మెంట్‌ పనులను పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

చిలుకూరు : మరో నాలుగైదు రోజుల్లో నారాయణపురం చెరువు కట్ట మరమ్మతు పనులు పూర్తవుతాయని ఇరిగేషన్‌ డీఈ స్వప్న, ఏఈ మానస తెలిపారు. బుధవారం చిలుకూరు మండలంలోని నారాయణపురం ఊర చెరువు కట్ట రివిట్‌మెంట్‌ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కట్ట పనులను నాణ్యవంతంగా, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నూతన అలుగు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ సరికాదు’



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్‌

గరిడేపల్లి : సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి సంవత్సరం దాటినా ఆ ఎన్నికలను వదిలేసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడం సరైనది కాదని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్‌ అన్నారు. బుధవారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో సీపీఎం జనరల్‌ బాడీ సమావేశాన్ని తుమ్మల సైదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణపై వివక్ష చూపుతూ, బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే నిధులు ఇస్తుందని ఆరోపించారు. మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్‌ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ దోసపాడు భిక్షం, మండల కమిటీ సభ్యులు బొల్లెపల్లి శ్రీనివాస్‌, తుమ్మల సైదయ్య, భూతం నాగరాజు, సోమయ్య, ఎల్లావుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి



పోలీస్‌ సిబ్బంది కిట్‌ బాక్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : పోలీస్‌ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పట్టణ పోలీస్‌ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది కిట్‌ బాక్స్‌లను పరిశీలించారు. కేసుల వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం పోలీస్‌ సిబ్బందికి పలు సూచనలు చేసి మాట్లాడారు. పోలీస్‌ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సంత్‌సేవాలాల్‌ జయంతి నిర్వహణ కమిటీ ఎన్నిక



సమావేశంలో అధికారులు, గిరిజన సంఘాల నాయకులు

హుజూర్‌నగర్ : సంత్‌ శ్రీసేవాలాల్‌ జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ ఎన్నికపై బుధవారం హుజూర్‌నగర్‌ పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులు.. గిరిజన సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్‌ శ్రీసేవాలాల్‌ జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ నియోజకవర్గ కన్వీనర్‌గా మఠంపల్లి మండలం చెన్నాయపాలెంకు చెందిన బానోతు తులసిరామ్‌నాయక్‌ను, కోకన్వీనర్‌గా తేజావత్‌ సైదులునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15న నిర్వహించే సంత్‌ శ్రీసేవాలాల్‌ భోగ్‌ భండార్‌ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నాగార్జునరెడ్డి, మంగా, కవిత, కమలాకర్‌, జ్యోతి, సురేందర్‌రెడ్డి ఎంపీడీఓలు, జిల్లా గిరిజన నాయకులు భూక్యా మంజీనాయక్‌, ధరావత్‌ నవీన్‌, మాలోతు భీముడు, తేజావత్‌ రవి, ధరావతు రాజా, నగేష్‌ రాథోడ్‌, రమావత్‌ నరి, గుగులోతు శ్రీను, బాణోతు భాస్కర్‌, ఇస్లావత్‌ బాలాజీ, బానోతు వీటి, చంద్రమౌళి, పద్మాబాయి, లక్ష్మీబాయి, సైదా, శౌరి, మధు, భరత్‌, శివ, ప్రేమ్‌, గిరిజన ఉద్యోగ సంఘంనాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ఎస్‌డీ హుజైఫా



కోదాడరూరల్ : విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్‌ బాణాల వసంత, సిబ్బంది

కోదాడరూరల్ : జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని రేస్‌ ఐఐటీ అకాడమీ చైర్మన్‌ బాణాల వసంతవెంకటర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాల విద్యార్థులు ఎస్‌.దీక్షిత 98.79, పి.సూర్యప్రకాష్‌ 98.43, ఎస్‌డి హుజాఫా 98.34, పి.రోహిత్‌రెడ్డి 98.02, సీహెచ్‌కెఎస్‌ స్వరూప్‌రెడ్డి 96.14, మణికంఠ 96.12, పి.వంశీ 96.11 పర్సంటైల్‌ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రి న్సిపాల్‌ కృష్ణారావు, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ సిరికొండ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 98.34 పర్సంటైల్‌

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం పరిధిలోని సీతా మెమోరియల్‌ స్కూల్‌ ఉపాధ్యాయుడు ఎస్‌డీ నాగుల్‌ మీరా కుమారుడు ఎస్‌డీ హుజైఫా జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో 98.34 పర్సంటైల్‌తో ఉత్తీర్ణత సాధించాడు. హుజైఫా.. సీతా మెమోరియల్‌ స్కూల్‌లోనే పదవ తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం కోదాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఈ సందర్భంగా హుజైఫాను సీతా మెమోరియల్‌ స్కూల్‌ చైర్మన్‌, అంజని సిమెంట్స్‌ ఎండి వెంకట్‌ రాజు, హెచ్‌ఎం పీజే థామస్‌, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీరామ యూత్‌ సభ్యులు



బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న సామాజిక కార్యకర్త నాగరాజు

మునగాల : మండలంలోని వెంకట్రాంపురంలో మూడు రోజుల క్రితం విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమై కట్టుబట్టలతో వీధిన పడ్డ నిరుపేద చింత సైదులు కుటుంబానికి గ్రామానికి చెందిన శ్రీరామ యూత్‌ సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్‌ సభ్యులు పోతుగంటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్‌, నాగేశ్వరరావు, అందె సాంబయ్య, బిట్టు వెంకటేశ్వర్లు, సురేష్‌, వెంకయ్య పాల్గొన్నారు.

బియ్యం అందజేత..

మునగాలలో నిరుపేద కుటుంబానికి చెందిన అమరోజు సోమయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందాడు. బుధవారం దశదినకర్మ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ మండల నాయకులు, సామాజిక కార్యకర్త చింతకాయల నాగరాజు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తాటికొండ సురేష్‌, తంగెళ్ల బుచ్చిబాబు, వల్లోజు జానకిరాములు, సుంకర సతీష్‌, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి పరామర్శ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌ పట్టణంలో ఇటీవల కొందరు యువకుల దాడిలో గాయపడిన గంజి శివను బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ సభ్యులు, కులస్తులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో భౌతికదాడులకు పాల్పడడం సరైన విధానం కాదని అన్నారు. బీసీలపై దాడులు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణ మహోత్సవం



మోతె : సిరికొండలో స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు



గరిడేపల్లి : పానుగోడులో దేవతామూర్తులను తీసుకెళ్తున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు బుధవారం రాత్రి శ్రీస్వామివారి కల్యాణాన్ని మట్టపల్లి దేవస్థాన ముఖ్యార్చకులు చివలూరి పద్మనాభాచార్యులు పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. గురువారం రథోత్సవం, పవళింపు సేవ ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్‌ సింగారపు సైదులు, ఈఓ నాగెళ్ల శంభిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, కమిటీ సభ్యులు కంచాల వీరారెడ్డి, ఉబ్బెపల్లి సైదులు, పుట్టపాకుల మల్లేశ్వరి, ఐతగాని శివయ్య, అర్చకులు నరగిరినాధుని రామకృష్ణమాచార్యులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో గల శ్రీరంగనాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వల్లప్రోలు నర్సింహాచార్యులు, పూజారులు వేదాంతం చక్రధరాచార్యులు, రంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫణిగిరి గుట్టపై ధ్వజారోహణం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఫణిగిరి గుట్టపై గల శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట విశ్వక్సేన ఆరాధన, ఆలయ శుద్ధి, తదనంతరం ధ్వజస్తంభానికి వద్ద ధ్వజపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చకులు, స్నానాచార్యులు, దేవాలయ అభివృద్ధి సమితి సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సిరికొండలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో స్వయంభూ శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసింహాచార్యులు వేదమంత్రాలతో కల్యాణాన్ని వైభవంగా జరపగా, వేడుకను చూసేందుకు గ్రామ భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



చిలుకూరు : అన్నదానం ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు



మఠంపల్లి : చౌటపల్లిలో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ దామిడి గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ రాష్ట్ర కోఆర్డినేటర్‌ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గునగంటి నాగరాజు, నందిగామ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పానుగోడులో..

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించారు. సుదర్శన హోమం, పూర్ణాహుతి జరిపారు. ఎదుర్కోళ్లు అనంతరం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్‌ కొంకపాక మృత్యుంజయశాస్త్రి, మాజీ ఎంపీపీ కటికం ఆశారమేష్‌, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, రాంబాబు, సైదాచారి, శ్రీదేవి, ఆదిరెడ్డి, సుధాకర్‌, సైదులు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో అన్నదానం

చిలుకూరు : మండల కేంద్రంలో గత రెండు రోజులుగా జరుగుతున్న శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం ముగిసింది. మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకుడు సీహెచ్‌.లక్ష్మీనారాయణరెడ్డి.. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌ వంగవీటి రామారావు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

యాతవాకిళ్ల వాసికి డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న బైరి నాగయ్య

మఠంపల్లి: మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బైరి నాగయ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ పొందాడు. జానపద సాహిత్యంలో ‘జానపద గేయాలలో సామాజిక జీవన చిత్రణ ’అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ నెల 11న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ అందుకున్నాడు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆచార్య గోనానాయక్‌ పర్యవేక్షణలో జానపద సాహిత్యంలో చేసిన పరిశోధనకుగాను తనకు డాక్టరేట్‌ వచ్చినట్లు తెలిపారు. నాగయ్య ప్రస్తుతం గరిడేపల్లి మండలం కల్మలచెరువు ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

నేడు అఖిల పక్ష సమావేశం

నేరేడుచర్ల : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌ కేంద్రాలపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్‌ కేంద్రాలపై ఏమైన అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈనెల 14 వరకు తెలియజేయాలన్నారు. 15వ తేదీన పోలింగ్‌ స్టేషన్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీలో ఆటవస్తువుల కొనుగోలుకు సాయం



టీచర్‌కు నగదు అందజేస్తున్న అయ్యప్పాచార్యులు

మఠంపల్లి : మండలంలోని లాలితండాలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆట వస్తువులు కొనేందుకు గాను మట్టపల్లికి చెందిన అర్చకులు పరాశరం అయ్యప్పాచార్యులు బుధవారం అంగన్‌వాడీ టీచర్‌ రంజాన్‌బీకి రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన యూత్‌ నాయకులు భూక్యా బాలు నాయక్‌, రంగానాయక్‌, శంకర్‌నాయక్‌, రవీందర్‌, బాబు, శంకర్‌, వినోద్‌కుమార్‌ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

మేళ్లచెరువు : అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్‌ ఆర్‌ఐ పసుమతి అన్నారు. మండలంలోని ఎర్రగట్టు తండా శివారులో కొందరు గత కొన్ని రోజులుగా అనుమతులు లేకుండా జేసీబీలతో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారని జిల్లా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం జిల్లా మైనింగ్‌ ఆర్‌ఐ ఎర్రగట్టుతండాకు చేరుకొని మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టిప్పర్లు, జేసీబీల వివరాలు నమోదు చేసుకొని వెళ్లారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మునగాల: సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం మునగాల మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో కోదాడ పట్టణానికి చెందిన యలమంచలి ఆదిశేషసాయి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు యలమంచలి శ్రీనివాసరావు –విజయలక్ష్మి దంపతులు నిర్మించిన నాలుగు అదనపు గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం నర్సింహాపురం గ్రామానికి చెందిన డాక్టర్‌ వేమూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మను అభినందించారు. కోదాడ డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి, డా.జాస్తి సుబ్బారావు, ముత్తవరపు పాండురంగారావు, ఆర్కిటెక్‌ డిజైనర్‌ వెంకటనర్సయ్య, ఓరుగంటి ప్రభాకర్‌, మునగాల ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్‌, పబ్బా గీత, నర్రా సత్యనారాయణరెడ్డి, ఆశ్రమ కోఆర్డినేటర్‌ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన గోశాల పూజలు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన గోశాల ప్రారంభ పూజలు బుధవారంతో ముగిశాయి . ఈ సందర్భంగా వేద పండితులు గూడూరు గోపికృష్ణ నిత్యార్చన, సంపుటిత శ్రీసూక్త సహిత లక్ష్మీ హోమం, సుదర్శన హోమం, శాంతి హోమం, ప్రాయశ్చిత హోమం, జయాది హోమం, మహా మంగళ పూర్ణాహుతితోపాటు వృషభ గోమాత కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన, అవభృథ స్నానం, మహా ఆశీర్వచనం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలను తిలకించారు. పబ్లిక్‌ క్లబ్‌ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి దంపతులు, వేద పండితులు బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి, మందిర చైర్మన్‌ కర్నాటి రవికుమార్‌, ప్రధాన కార్యదర్శి మన్నెం సదాశివరెడ్డి, మల్లికార్జున్‌, ఆలయ అర్చకులు విశ్వేశ్వర శర్మ, గంగాధర శర్మ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

సూర్యాపేట : లయన్స్‌ కంటి ఆస్పత్రి, లయన్స్‌ క్లబ్‌ సూర్యాపేట సహకారంతో సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌ 45వ వార్డులో బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని లయన్స్‌ కంటి ఆస్పత్రి చైర్మన్‌ దోసపాటి గోపాల్‌ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్‌ క్లబ్‌ ప్రెసిడెంట్‌ మర్రి లక్ష్మారెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌ నూకల వెంకటరెడ్డి, జోన్‌ చైర్మన్‌ దేవిరెడ్డి రవీందర్‌ రెడ్డి, వంశీ, శభరినాథ్‌, తదితరులు పాల్గొన్నారు.